# భంగిమ

-జాజుల గౌరి

అరగంట నిరీక్షణ తర్వాత నిండు గర్భిణిలా వచ్చిన ఆర్టీసి బస్సు స్టాపులో ఆగి ఆగకుండానే ఊపందుకుంటుంటే పరుగెత్తుకెళ్ళి రెండు మెట్లు ఎక్కానో లేదో అమాంతంగా లోపల పడ్డాను.

బస్సు మిస్సవుతుందని ఎవరి ఆత్రం వాళ్ళది. ఈ బస్సు గనుక మిస్సయితే మళ్ళీ ఓ గంట నిరీక్షించాల్సిందే.

బస్సుతో పాటు చాలా దూరం పరిగెత్తానేమో ఆయాసంతో చెమట్లు పట్టాయి. ఎలాగైతేనేం సీటు వెనకున్న పైపుని పట్టుకుని నిల్చున్నాను.

అంతలోనే పద్మవ్యూహంలోని అభిమన్యుడిలా కండక్టర్ "టికెట్" "టికెట్"... అంటూ వస్తుంటే.

''పాస్'' అన్నాను బస్‌పాస్‌ను చూపించకుండానే.

"పాస్‌లున్నవాళ్ళు చూపించాలమ్మా" అతని మాటల్లో విసుగు. "కాలు మోప సందు లేదు. బ్యాగులో ఉన్న పాస్‌ను ఎలాతీసేదండి" ఆ పక్కనే గొణిగారెవరో.

అయినా తప్పని పరిస్థితి. బ్యాగులోంచి బస్సు పాస్ తీయాల్సిందే. అటు ఇటూ జనాల మీద తూలుతూనే పాస్ తీసి చూపించా.

కళ్ళతో చూస్తూనే 'ఊ' అంటూ ముందుకు కదిలాడు కండక్టర్. పెట్టెలో బట్టలు కుక్కినట్లు బస్సులో జనాలు గాలాడే సందులేక ఉక్కపోతతో ఊపిరి సలపటం లేదు.

ఓ అరగంట ఇలాగే జర్నీ చేస్తేగాని గమ్యాన్ని చేరలేను. అందాక ఓపిక పట్టాల్సిందే.

"ఆఫీసు అవర్స్‌లో అదనంగా పది బస్సులు వేస్తే వీళ్ళ సొమ్మేం పోయిందో చార్జీలను మాత్రం ప్రతి సంవత్సరం టంచనుగా పెంచుతారు" ఆర్టీసి వాళ్ళ మీద కోపం ముంచుకొచ్చింది.

బస్సులోని వాతావరణానికి తగ్గట్టు నా ఆలోచనలు గజిబిజిగా సాగుతుండగానే నేను దిగాల్సిన స్టేజి వచ్చేసింది. గబగబా బస్సు దిగగానే చల్లగాలి మలయమారుతంలా చుట్టేసరికి క్షణకాలం హాయిగా అన్పించినా కొద్దిసేపట్లో మళ్ళీ యథాస్థితి. బయట ఎండ చండ ప్రచండంగా ఉండి పెనం మీద నుండి పొయ్యిలో పడ్డట్టయింది నా పరిస్థితి.

గబగబా ఆఫీసు దిక్కు అడుగులేశా.

ఆఫీసులోకి ఎంటర్ అయ్యేసరికి అక్కడంతా అంధకారం.

"వేసవిలో ప్రతిరోజు ఒక గంట విద్యుత్ కోత" అంటూ విద్యుత్ బోర్డు వాళ్ళు ఒక నెల రోజుల ముందే న్యూస్ పేపర్లలో, టీ.వీలలో, రేడియోలో అనౌన్స్ చేశారు. ఇప్పుడు అక్షరాల పాటిస్తున్నారన్నమాట. 'హు' అని నిట్టూరుస్తూ రిజిష్టరులో సంతకం పెట్టి నా సీటులో కూర్చున్నానన్నమాటేగాని ఒళ్ళంతా చెమటలు పట్టి అసహనంగా అటు ఇటూ చూస్తున్నాను.

అప్పుడే వస్తున్న నా కొలీగ్ కమ్ ప్రాణస్నేహితురాలు సుజాత నన్ను చూసి "హాయ్ వసూ, గుడ్‌మార్నింగ్" అంటూ హుషారుగా విష్ చేసింది.

"ఆ గుడ్ మార్నింగ్. అబ్బబ్బా పొద్దున్నే ఎంత ఉక్కపోతే బాబు. ఈ వేడిని భరించలేక ఛస్తున్నా. అయినా ఈ ఎలక్ట్రిసిటీ వాళ్ళకి మన మీదేం కక్షే ఈ సమయంలో పవర్‌కట్ చేస్తున్నారు" అని విసుక్కుంటూ న్యూస్ పేపర్‌తో గాలి విసురుకోసాగాను.

"మొదలైందా. ప్రతి రోజూ ప్రొద్దున్నే నువ్వు పాడే పాటేగా. అయినా అలా ఆఘమేఘాల మీద రాకపోతే కాస్త తొందరగా బయలుదేరి వస్తే నీ సొమ్మేం పోయిందే? చివరి నిముషంలో పరుగందుకుంటే పరిస్థితి ఇలాగే ఉంటుంది మరి" అని సుజాత లెక్చర్ ఇచ్చేసరికి నాకు కోపం ముంచుకొచ్చి

"నీకేం తల్లీ, నువ్వు అలాగే మాట్లాడతావు. ఇంట్లో అమ్మ అన్నీ రెడీ చేసి పెడ్తే చక్కగా ముస్తాబై కూల్‌గా ఆఫీసుకు వచ్చేస్తావు గానీ నేనలా కాదే.

పిల్లలను, ఈయనను బయలుదేర తీసేటప్పటికీ నా తలప్రాణం తోకకొస్తుంది. ఆ తర్వాతే నేను బయట పడాలి. నీకు పెళ్లయిన తర్వాతే నా బాధేంటో తెలుస్తుంది" అని అంటుంటే సుజాత నా మాటలు పట్టించుకోకుండా.

"నువ్వు సవాలక్ష కారణాలు చెప్తావు కానీ, ఎండాకాలంలో ఎండలుండక పోతే వానలు కురుస్తాయా ఏంటి? ఎండాకాలంలో వేడిని భరించనంటావు. వానలు కురిస్తే చీదరించుకుంటావు, చలి అసలే భరించలేవు. మహాతల్లీ! నువ్వసలు ఈ భూమి మీద పుట్టాల్సిన దానివి కాదులే, ఎక్కడో స్వర్గలోకంలో ఉండాల్సిన దానివి" అంటూ నన్ను ఉడికించేసరికి.

"ఆ చాల్లే నా మొఖానికి అంత అదృష్టం కూడానా? అయినా సుజా! మనిషి దేన్నీ అతిగా భరించలేడోయ్, ఏదైనా లిమిట్‌లో ఉండాలి. కానీ అదెక్కడేడ్చింది. ఉంటే అతివృష్టి, లేకుంటే అనావృష్టి. ఎట్లయినా మనకే నష్టం" అని నేనంటుంటే.

'కారణం ఎవరు వసూ, అభివృద్ధి పేరుతో మానవుడే కదా కాలుష్యాన్ని సృష్టించి కష్టాల్ని కొని తెచ్చుకుంటున్నాడు" అన్నది.

వెంటనే "ఆ... ఆ... మానవుడే ఇప్పుడిప్పుడే ప్రత్యామ్నాయాన్ని కూడా ఆలోచిస్తున్నాడు అది గుర్తుంచుకో"

"ఆ అన్నీ నువ్వే చెప్తావు కానీ పాపం విద్యుత్ బోర్డు వాళ్ళు నిన్ను ఎప్పుడు కరుణిస్తారో. ఇంద ఈ నీళ్ళు తాగి కాస్త చల్లబడు" అంటూ వాటర్ బాటిల్ నా చేతిలో పెడ్తూ ఓ జాలి చూపు నా వైపు విసిరి ఫైలు ముందేసుకుంది.

సుజాత మాటలకి నా మనస్సు చిటపటలాడినా నీళ్ళు తాగి ఆఫీసంతా కలియజూశా.

దాదాపు అందరి పరిస్థితి నాలాగే ఉండి ఉక్కపోతను భరించలేక ఎలక్ట్రిసిటీ బోర్డు వాళ్ల కరుణా కటాక్షాల కోసం ఎదురు చూస్తూ న్యూస్ పేపర్లు, అట్టలతో యధాశక్తి గాలి విసురుకుంటూ కన్పించారు.

కాలం యథావిధిగా పరుగులు పెడుతూనే ఉంది.

సాయంత్రం ఐదు గంటలు కాగానే ఊపిరి సలపని పనిలోంచి బయట పడ్డాను.

బ్యాగులో టిఫిన్ సర్దుతూ సుజాత కోసం చూశాను.

సీటులో లేదు. ఆఫీసంతా చూశా. ఎక్కడా కన్పించలే. ప్యూన్‌ని పిలిచి సుజాత గురించి అడిగే సరికి

"మేడం సార్ రూంలో ఉందండి" అంటూ మా హెడ్ రూం దిక్కు చూపాడు. "ఎంతో అర్జంటు పని ఉంటేగానీ ఈ టైమ్‌లో మా హెడ్ ఎవరినీ పిలవడు. సుజాతనే పిలిచాడంటే ఏదైనా అర్జంటు ఫైలు క్లియర్ చేయాలేమో, ఇక ఆ పని పూర్తయ్యే సరికి ఎంత లేదన్నా ఓ గంట పడ్తుంది. ఇక అంతే సంగతులు" అనుకుంటూ...

"సరేలే, తన కోసం చూసి వెళ్ళానని సుజాతగారితో చెప్పు" అంటూ ఆఫీసు నుంచి బయట పడ్డాను.

"హమ్మయ్య, ఇప్పుడు ఏ హడావిడి లేదు. కాస్త లేటయినా ఇల్లు చేరొచ్చు. ఈ పాటికి నానీ, చింటూ స్కూలు నుంచి ఇంటికి వచ్చేసి ఉంటారు. బుద్ధిగా హోం వర్కు చేస్తున్నారో లేక ఇటు వస్తువులు అటు, అటు వస్తువులు ఇటు పడేస్తూ, ఇల్లంతా రణరంగం చేశారో. వీళ్ళ అల్లరి భరించడం కష్టం బాబూ. ఇంట్లోకి ఏం కూరగాయలు తీసుకెళ్తే బాగుంటుంది? మార్కెట్‌లో ఏవి నచ్చితే అవి. దొరగారు ఈ పాటికి ఆఫీసు నుంచి బయలు దేరి ఉంటారు. ఈ మధ్య ఇంటికి వెళ్లే సరికి కాఫీ కప్పుతో ఈయనగారు ప్రత్యక్షమౌతుంటే భలే నవ్వు వస్తోంది. గతానికి, ఇప్పటికి ఎంత తేడా? అయినా ఫెమినిస్టులు ఈ సమాజం ఇంకా మారాలంటున్నారు. కాని ఓ సందేహం. స్త్రీ, పురుషులు వేరువేరుగా ఉంటే ఈ సమాజం అభివృద్ధి చెందేదేనా, నిజంగా పోరాటవాదులు వారి ఆదర్శాలకు తగ్గట్టు ఇళ్ళల్లో కూడా యింత నిక్కచ్చిగా ఉంటారా? ఏమో వాళ్లని గమనించే అవకాశం ఇంతవరకు రాలేదు కానీ ఒక వేళ ఆ అవకాశమే వస్తే నా భావాలు ఎలా ఉంటాయో? ఏ ఉద్యమం అయినా ఊరకనే

పుట్టదు కదా? పురుషులతో సమానంగా స్త్రీకి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలనిస్తే ఈ పోరాటం ఉండేది కాదేమో" ఇలా తలా తోకాలేకుండా నా ఆలోచనలు కొనసాగుతుంటే రోడ్డు పక్కగా నడుస్తున్నాను.

పక్కనే టీ కొట్టు, మిర్చిల బండి, పాన్‌షాపుల దగ్గర జనాలు బాతాఖానీ కొడుతూ కొందరు టీ తాగుతుంటే, యింకొందరు మిర్చీలు తింటున్నారు. మరికొందరు సిగరెట్ వెలిగించి గుప్పు గుప్పున పొగ వదులుతూ వచ్చే పోయే జనాలను చూస్తూ నిల్చున్నారు.

రోజూ వీళ్లందరిని దాటాలంటే కాస్త ఇబ్బందే అయినా ఎవరి బతుకు వాళ్ళది. బతుకు బండి కదలాలంటే ఇలాంటి వాటినన్నింటిని మనం దాటాలనుకుంటూ, టీ కొట్టు, మిర్చిల బండి పాన్‌షాపును దాటేశాక పాన్ షాపుకీ కిరాణా కొట్టుకీ మధ్యనున్న చెట్టు కింద అకస్మాత్తుగా నా చూపులు నిల్చిపోయాయి.

అక్కడ చెట్టు నీడన ఓ వ్యక్తి పడుకొని ఉన్నాడు. పడుకొని ఉన్నాడనే కంటే బాగా తాగి తూలాడేమో బట్టలన్నీ అస్తవ్యస్తమై అతడు పడున్న తీరును చూస్తే గుండె జల్లుమన్నది.

"ఛీ... ఛీ... జనాలు నడిచే చోట పబ్లిక్ ప్లేస్‌లో ఇలా పడున్నావేంటి, ఇంట్లో భార్యా పిల్లలను సరిగా చూడలేరు కానీ ఇలా తప్పతాగి రోడ్ల మీద పడ్తారు వెధవలు" అనుకుంటూ చూపు మరల్చి గబగబా ముందుకు నడిచా.

ఇంటికి వెళ్లానన్నమాటే కాని రోడ్డు పక్కన స్పృహలేకుండా అసహ్యంగా పడున్న ఆ వ్యక్తే కళ్ళముందు మెదలసాగాడు.

ఇదేంటి ఎంతసేపటికీ ఆ వ్యక్తి ఆలోచనలు నన్ను వీడడం లేదేంటి? ప్రతి రోజూ ఎంత మందినో చూస్తుంటాను కానీ అతను పడుకున్న తీరు వెగటును కల్గించి పదే పదే అతను జ్ఞప్తికి వస్తుంటే చిరాకేసింది. ఆ వ్యక్తి గురించి ఆలోచించడం వల్ల లాభం లేదు నష్టమూ అంతకన్నా లేదు. కానీ అతని గురించే ఎందుకాలోచిస్తున్నానో అర్థం కాలేదు.

మర్నాడు ఉరుకులు పరుగుల మీద ఆఫీసుకు వచ్చి అరగంటయినా సుజాత రాకపోయేసరికి సెలవు పెట్టిందేమో అనుకున్నాను.

సుజా లేకపోయేసరికి వెలితిగా అన్పించింది.

ప్రతిరోజూ ఈ సమయానికి సుజాత ముందు హడావిడి చేసే నేను ఈ రోజు నిశ్శబ్దంగా సీట్లో సర్దుకున్నాను.

ఓ గంట ఆలస్యంగా సుజాత వచ్చి నీరసంగా సీట్లో చేరగిలబడింది కానీ ఎప్పటిలా నన్ను పలకరించక నిశ్శబ్దంగా ఉండి పోయింది.

ఇవాళ తనలో ఏదో మార్పు కొట్టొచ్చినట్టు కన్పించే సరికి వాటర్ బాటిల్‌ని ఇస్తూ "ఏం సుజా ఆరోగ్యం బాగాలేదా అలా ఒకలాగా ఉన్నావేంటి?"అని అడిగా.

సుజాత మారు మాట్లాడకుండా నీళ్ళు తాగి ఫైళ్ళు చూడసాగింది.

అంతసేపు తనకోసం ఎదురుచూసి రాగానే పలకరించి నీళ్ళు ఇచ్చిన నాకు కనీసం థాంక్సయినా చెప్పకుండా పనిలో మునిగిన నా ప్రియనేస్తాన్ని చూస్తే నాకు చిర్రెత్తుకొచ్చి

"ఏయే సుజా, నీళ్ళిచ్చినందుకు కనీసం థ్యాంక్సయినా చెప్పకుండా ఇలా వచ్చి అలా పనిలో మునిగావు. ఏంటమ్మా అంతసీను" అన్నాను ఉక్రోషంగా.

నా మాటలకు చిన్నగా నవ్వి "ఏం లేదు వసూ! మధ్యలో బస్సు ఫెయిలయింది. మరో బస్సు క్యాచ్ చేసి వచ్చేసరికి లేటయిందంతే" అంటుంటే "ప్రతి రోజూ ఆటపట్టిచ్చే దానివిగా. ఇవాళ తెలిసిందా? నెలలో కనీసం ఓ ఇరవై సార్లన్నా నీకు ఇలాంటి సన్మానం జరిగితే ఆ ఏడుకొండల వాడికి నెలకో కొబ్బరికాయ కొడ్తా" అన్నా.

సుజాత నా దిక్కు ఉడుక్కుంటూ చూసి "నీ రాక్షస భక్తికి సంతోషించా గానీ అదేంటి వసూ నిన్న అలా వెళ్లావేంటి?" అని అడిగింది.

"నీ కోసం చూశా సుజా కానీ నువ్వు హెడ్‌గారి రూంలో ఉన్నావు. అర్జంటు ఫైల్ క్లియర్ చేయాల్సి ఉందేమోనని వెళ్లా, కానీ సుజా! నిన్నదార్లో ఏం జరిగిందో తెల్సా? అన్నా, నిన్న చెట్టు కింద పడున్న వ్యక్తిని గుర్తుకు తెచ్చుకుంటూ.

"ఏం జరిగిందేంటి" సుజాత మాటల్లో ఆసక్తి.

"అబ్బా చెప్పటానికే అసహ్యంగా ఉందే. అదే మనం బస్‌స్టాపుకు వెళ్లే దార్లో కిరాణకొట్టు పక్కనున్న చెట్టు కింద ఒకతను తప్పతాగి ఎంత అసహ్యంగా పడున్నాడో తెల్సా, అబ్బా అది చూస్తుంటేనే డోకు వచ్చిందనుకో. చుట్టు పక్కలంతా జనాలు, ఆ దార్లో మామూలుగా నడవటమే ఇబ్బందంటే మధ్యలో ఇలాంటి సీన్లు తలెత్తుకోలేక పోయా. ఏం మనుష్యులో ఫుల్‌గా తాగేయటం, ఇలా రోడ్ల పక్కన పడి జనాలను ఇబ్బంది పెట్టడం. వీళ్ళకి ఇంతన్నా బుద్ధుందా, ఇంట్లో పెళ్లాం పిల్లల గురించి ఆలోచించరు కానీ ఇలాంటి నిర్వాకాలకేం లోటు లేదు" అంటూ నా ధోరణిలో చెప్తూ ఫైలు చూస్తున్నాను.

నా మాటలు పూర్తయినా సుజాత నుండి ఎలాంటి రెస్పాన్స్ రాకపోయే సరికి తల తిప్పి చూశా.

జేవురించిన ముఖంతో నన్ను తీక్షణంగా చూస్తుండడం చూసి తత్తరపడ్డాను.

క్షణకాలం నాకేం అర్థం కాలేదు. అయినా వెంటనే నర్దుకొని "ఏం సుజా! అలా చూస్తున్నావేంటి నేనేమైనా తప్పుగా మాట్లాడానా?" అన్నాను.

సుజాత నన్ను మరింత సీరియస్‌గా చూస్తూ "వసూ నువ్వు చెప్తున్నది నిన్న సాయంత్రం ఐదు గంటలకి కిరాణ కొట్టు పక్కనున్న చెట్టు కింద పడున్న వ్యక్తి గురించేనా" అని అడిగింది.

"అవును అతని గురించే. అతన్ని నువ్వు కూడా చూశావా?" అన్నాను.

కానీ సుజాత నా మాటలు పట్టించుకోకుండా "అక్కడ పడున్న వ్యక్తి తాగి పడ్డాడని నీకు ఖచ్చితంగా తెల్సా" అని నన్ను ఎదురు ప్రశ్నించేసరికి "ఇదేం ప్రశ్న. నేను ఖచ్చితంగా చెప్పలేను కానీ తాగాడు కాబట్టే అలా ఒంటిమీద స్పృహ లేకుండా పడున్నాడు" నా మాటలని సమర్థించుకున్నాను.

"ఏం తాగకుండా పడలేరా" సుజాత మాటల్లో వెటకారం.

"పడొచ్చుకాని అతను ఎంత అసహ్యంగా పడున్నాడో తెల్సా" అని నేను మొండిగా అంటుంటే.

"అలా అని నువ్వేమన్నా సరిచేశావా" అన్నది.

సుజాత మాటలు సూటిగా తగిలాయి.

"ఏంటీ అలా మాట్లాడతావు నేనెందుకు సరిచేస్తాను".

## నవ్వుల్ని నిలబెట్టండి

నవ్వులు
మానవత్వానికి చిరునామాలు
దైవత్వానికి ప్రతిరూపాలు
పెదాలమీద ఉదయించే నవ్వులు
పువ్వుల్లా
మనసులను అలరిస్తాయి
సేతువుల్లా
హృదయాలను కలుపుతాయి
మబ్బుల్లా
శాంతి సుధలను వర్షిస్తాయి
పసిపాపలు విరజిమ్మే పాలనవ్వులు
మంత్రపుష్పాల్లా
అద్భుతాలను ఆవిష్కరిస్తాయి
ఆశ్చర్య చకితుల్ని చేస్తాయి
కరకు హృదయాలను కూడ
కరుణ సదనాలుగా నిలబెడతాయి.
రాతి బండలను కూడ
నీటి చెలమలుగా మారుస్తాయి
పదును కత్తులను కూడ
దూది వత్తులను చేస్తాయి
నవ్వుతూ నవ్వించే వారు
మానవతామూర్తులు
నవ్వుల్ని నిలబెట్టి
శాంతిని వెలిగించండి
నవ్వుల్ని కూలగొట్టి
అశాంతిని రగిలించకండి

-జి.నీలకంఠం

"మరి నువ్వు సరిచేయలేనప్పుడు అతన్ని అంతలా తిట్టుకోవటం దేనికి" అన్నది.

ఈ వితండవాదానికి నాకు చిర్రెత్తుకొచ్చి "ఏంటి సుజా! అతనేమైనా నా చుట్టమా, నాకు తెలిసినతనా? నేనెందుకు అతన్ని సరిచేయాలి? రోడ్డు పక్కన పబ్లిక్ ప్లేసులో పడుంటే చూడ్డానికి అసహ్యంగా ఉందని అన్నానే కానీ మరో ఉద్దేశం కాదు. దీనికి ఇంతలా వాదిస్తున్నావేంటి? అంటూ మాట పూర్తి చేయకముందే.

"ఆపు తల్లీ ఆపు! ఈ క్షణం నువ్విలా మాట్లాడుతుంటే నాకే సిగ్గేస్తోంది" అంటూ తల పట్టుకుంది.

ఊహించని మాటను వినేసరికి బిత్తర పోయాను.

"ఏంటి సుజా! అలా మాట్లాడుతున్నావేంటి?" అంటూ నా సీటులోంచి లేచి తన ముందుకెళ్లి నిల్చున్నా.

సుజాత నా కళ్ళలోకి సూటిగా చూస్తూ, "వసూ! నువ్వు చూసి వూహించుకుంది నిజం కాదు. తప్పతాగి అసహ్యంగా పడున్నాడని పదే పదే అంటున్నావే అది నిజం కాదు వసూ, నిజం కాదు. అది, అది అసభ్య భంగిమ కానేకాదు. అది మృత్యు భంగిమ, అతను తప్పతాగి పడలేదు. ఎండలో తిరిగి తిరిగి వడదెబ్బకు గురై సొమ్మ సిల్లి పడుకుని ఆ నిద్రలోనే ప్రాణాలను వదిలాడు. అసలు జరిగింది ఏమిటంటే నిన్న మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో టీ కొట్టులో నీళ్ళు తాగి చెట్టుకింద నిద్రపోయాడట. సాయంత్రం ఆరు గంటలు దాటుతున్నా అతను లేవలేక పోయే సరికి చుట్టుపక్కల వారికి అనుమానం వచ్చి కదిపిచూస్తే అప్పటికే అతని ప్రాణాలు గాల్లో కలిశాయట. ఆధారాలేమైనా దొరుకుతాయేమోనని జేబులు వెతికితే మన ఆఫీసు అడ్రసు దొరికిందట. కొంతమంది ఆ కాయితం పట్టుకుని నిన్న సాయంత్రం మన ఆఫీసుకొచ్చి ఈ విషయం చెప్పేసరికి అందరం పరుగెత్తి చూశాం. అతనెవరో తెల్సా వసూ?" అని ఆగింది.

"ఆ... ఎవరు... ఎవరు..." అన్నాను ఆత్రంగా. "మన ప్యూను సూరి తండ్రి" అంటూ నిర్లిప్తంగా చూసింది.

ఆ మాట వినగానే కొయ్యబారిపోయాను. నోరు పెగల్లేదు. సూరి గురించి నా కళ్ళు ఆత్రంగా వెతికాయి.

కొన్ని క్షణాల తర్వాత తేరుకొని "సారీ సుజా! ఇలా జరిగిందని నాకేం తెలుసు తెలిస్తే అలా మాట్లాడతా?" అన్నాను మెల్లిగా.

"తెలిస్తే ఎవరైనా మాట్లాడతా వసూ? నిన్న నీవెంట నేనున్నా అలాగే ఆలోచించేదాన్నేమో. కాని ఏం చేస్తాం జరగకూడనిది జరిగిపోయింది" అంటూ బాధగా నిట్టూర్చింది.

"అయినా సుజా! సూరీవాళ్ళ నాన్న అక్కడెందుకు పడుకున్నాడు?" అన్నా.

"ఎక్కడో మారుమూల పల్లెటూరి నుండి వచ్చి సూరి ఇక్కడ ఉద్యోగం చేస్తున్నాడు. కొడుకును వెతుక్కుంటూ తండ్రి వచ్చాడు కానీ ఈ మహానగరంలో అక్షరాలు సరిగా రానివారికి అడ్రస్సులు ఎలా తెలుస్తాయి? ఒక వేళ ఎవరన్నా అడ్రస్సు చెప్పినా కరెక్టు దారిని చూపి గమ్యం వరకు ఎవరు చేరుస్తారు? విషాదకరమైన విషయం ఏమిటంటే కొడుకును వెతుక్కుంటూ యింతదూరం వచ్చి అడ్రస్సు వెతుక్కుంటూ ఎండలో తిరిగి తిరిగి కొద్ది దూరంలో ఉన్న కొడుకును చేరలేక ఈ లోకాన్ని వదిలి పోయాడు ఆయన.

"వసూ! ఈ రోజుల్లో ఎంత దారుణమైన పరిస్థితులు మన కళ్లెదుట ఉన్నాయో చూస్తున్నావా. కనీసం ఎదుటి మనిషిని పట్టించుకొనే స్థితిలో మనమున్నామా? ఈ యాంత్రిక జీవితంలో అత్యున్నత శిఖరాలకు చేరాలనే ఆరాటాలే తప్ప ఆ వేగంలో సాటి మనిషి పట్ల చూపించాల్సిన మానవతను మర్చిపోతున్నాం" అని ఆవేదనగా అంటుంటే.

సుజాత మాటల్లోని నగ్నసత్యం నా చెంపని చెళ్ళుమన్పించింది. "ఛా నేనెంతా మరుగుజ్జుగా ఆలోచించాను" అని అనుకుంటుంటే అధః పాతాళానికి దిగజారుతున్న భావన నన్నావరించి నిస్సత్తువగా కూలపడ్డాను.